# మౌనానురాగం

పట్లూరి రజనీ ప్రియ సాగర్

**ఎర్నెస్ట్ హాకెల్ భూత జీవవాదం (హైలోజోయిజమ్) ఈ కథకి ప్రేరణ. ఈ వాదం ద్రవ్యాలకు (అణువులకు) మానసిక లక్షణాన్ని ఆపాదిస్తుంది.**

—రచయిత

ఊపిరాడక పోయేసరికి కళ్ళు తెరిచాను. చుట్టూ భయంకరమైన చీకటి. నేనెక్కడున్నానో నాకు తెలీలేదు. ఎంతో ప్రకాశవంతంగా వుండే నా కళ్ళు మినుపటంత కాంతివంతంగా లేవు. ఇప్పటికి ఎంత సేపయిందో నేనిలా చీకట్లో పడివుండబట్టి. ఒక గంటా? రెండు గంటలా? మూడా? ఉహూ. ఇంకా ఎక్కువే అయి వుంటుంది.

లయబద్ధంగా శబ్దం విన్పిస్తున్నా నా గుండె బలహీన పడుతోందని నాకు తెలుస్తూనే ఉంది. ఈ నిర్బంధం ఇలాగే కొనసాగితే ఏమవుతుంది? నా రెండు భుజాల్లో ఒక భుజం చుట్టూ ఏదో బిగించబడి బిగుతుగా వుండడంతో నొప్పిగా ఉంది. సాయంత్రం ఆయన నన్ను ఆ కసాయివాడికి అప్పగించినప్పుడు అనుకున్నాను ఇలాంటిదేదో జరుగుతుందని అనుకున్నది అక్షరాలా జరిగింది. నన్నీ చీకట్లోకి తోసేశాడు ఆ కసాయివాడు.

క్రిరుమని శబ్దం వినిపించేసరికి ఆలోచనల్నుంచి తేరుకుని కళ్ళు పెద్దవి చేశాడు.

కాసింత వెలుతురు పడి మళ్ళీ మాయమయింది. తలుపు ఎవరో తెరచి మళ్ళీ మూసేశారన్నమాట! నా హృదయ స్పందనల శబ్దక్రమం కాసింత పలుచబడసాగింది. ఇంకొన్ని గంటలు ఇలాగే దొర్లిపోతే ఏమవుతుంది? ప్రాణం పోతుంది! అంతేనా?

నో.. నో .. అలా జరగడానికి వీల్లేదు కనీసం ఒకసారయినా ఆయన్ని చూడాలి.. అవును. ఆయన్ని చూడాలి. ఆయన అంటే నాకెంతో ఇష్టం. అదోలాంటి మౌనప్రేమ. ఆయన్ని ఆరాధిస్తాను నేను. నా పట్ల ఆయనకే భావం వుందో కచ్చితంగా తెలీదు కాని ప్రేమ వున్నట్లే అనిపించేది ఆయన ప్రవర్తన గమనించినప్పుడల్లా. ఆయన్ని మొదటిసారి చూడ్డం కంటే ముందు ఓ చిన్న సంఘటన జరిగింది.

ఆ సంఘటన జరిగి ఇప్పటికి కనీసం పది సంవత్సరాలయి వుంటుంది. అప్పటికి నేను పుట్టి ఎన్ని సంవత్సరాలయిందో నాకు తెలీదు. ఆ మాటకొస్తే నేను ఎక్కడ పుట్టానో కూడా నాకు తెలీదు. నా ప్రతి అవయవం అతి నాజూకయినదని ప్రచారం మాత్రం జరిగింది. నాకో ధర నిర్ణయించి అద్దాలగదిలో అందమైన వేదిక మీద పెళ్ళి చూపులకోసమన్నట్లు కూర్చోబెట్టారు నన్ను. రోజూ ఎన్నో చేతులు నన్ను స్పృశించేవి. ఎన్నో జతల కళ్ళు నన్ను నఖశిఖ పర్యంతం చూసేవి. కాని నన్నెవ్వరూ తమ స్వంతం చేసుకోలేదు. రోజులు గడిచే కొలది నేనెవరికీ నచ్చలేదన్న బాధ నాలో చోటు చేసుకోసాగింది. అదే సమయంలో ఓ రోజు అందమైన ఓ చెయ్యి నన్ను దగ్గరకి లాక్కుంది. నేను పులకరించిపోయాను. తీరా చూస్తే ఆమె స్త్రీ. అందంగా ఉంది. ఆమెతో బాటు మరో యువతి మరి నన్నెందుకు దగ్గరకి తీసుకున్నట్లు? నాకు సందేహం కలిగింది. ఎందుకంటే నన్ను పురుషుల కోసం సృష్టించారని నాకు తెలుసు. ఆమె స్త్రీ. మరి నన్నెందుకు దగ్గరికి తీసుకుంది?

ఆలోచిస్తుంటే వాళ్ళ సంభాషణ వినిపించింది.

"బావుందా?"

"ఎవరికి"

"సార్ కి"

"ఏ సార్ కి"

"ట్యూషన్ సార్ కి"

"అంత అభిమానమా"

"ఊ"

నా జీవితంలో ఆ రోజు ఓ అపూర్వమైన రోజు. ఎన్నటికీ మరిచిపోలేని రోజు. ఆయన పట్ల నాకు మంచి అభిప్రాయం ఏర్పడింది. అంత అందమైన ఆమె అభిమానాన్ని చూరగొన్న ఆయన ఎంత గొప్పవాడై ఉండాలి. నేను ఆయన దాన్నయిపోతే ఎంత బావుండేదని అనుకున్నాను. క్షణం కోసం కలిగిన ఆ వూహ అతి మధురమైన కలలా తోచింది. ఆ నా ఊహ... నా కల... నిజమైంది.

ఆరోజు ట్యూషన్ చెప్పడానికి వచ్చినప్పుడు ఆయన ముందు కూర్చోబెట్టారు నన్ను. ఆ అమ్మాయి తల్లిదండ్రులు కూడా ఉన్నారు. అదే మొదటిసారి ఆయన్ని చూడ్డం.

మా చూపులు కలుసుకున్నాయి.

నా హృదయ స్పందన్ని ఆయన హాయిగా వింటున్నట్లనిపించింది నాకు. నేనాయన వైపు కే తదేకంగా చూస్తుంటే ఆ అమ్మాయి తండ్రికి ఆయనకి మధ్య సంభాషణ వినిపించింది.

"నచ్చలేదా?"

"అహా... అదేం కాదు.. చాలా బావుంది కానీ.."

"అమ్మాయి చాలా ఇష్టపడుతుంది. కాదనకండి"

"ఒక్కక్షణం కోసం ఆ అమ్మాయి తండ్రి ముఖంలోకి చూసి నన్ను దగ్గరకి తీసుకున్నాడు.

నేను సిగ్గుతో ముడుచుకుపోయాను.

ఆరోజు నన్ను చూసి పాఠం ప్రారంభించాడు.

ఆ క్షణాల్ని నేను మరిచిపోలేను. ఒక గంట తర్వాత నా వైపుకోసారి చూసి పాఠం ఆపేశాడు.

ఆ రోజు నుంచి అతని ప్రతి దినచర్యలో నేను భాగస్వామినయ్యాను. నన్ను చూడందే వుండలేకపొయ్యేవాడాయన.

అతను చాలా బీదవాడని ఆ ఇంట్లోకి వెళ్ళిన మొదటి క్షణమే అర్థమయిందినాకు. జాలివేసింది. అతని పట్ల నాకున్న ప్రేమ మరింత పెరిగింది.

పాపం! తినడానికెక్కడ ఇబ్బంది పడుతున్న రోజులవి. ట్యూషన్ల మీదే బ్రతకడం. ఉదయం నుంచి సాయంత్రం దాకా ట్యూషన్లే! ఉద్యోగం లేదు. తల్లిదండ్రులు దూరంగా ఎక్కడో ఒక గ్రామంలో వ్యవసాయం చేస్తుంటారట.

వాళ్ళ బ్రతుకులు అంతంత మాత్రమే ఒకోసారి గ్లాసెడు మంచి నీళ్ళుతాగి కడుపులోని ఆకలిమంటను చల్లార్చుకుంటుంటే పాపం అనిపించేది నాకు. రెండేళ్ళు గడిచిపోయాయి.

ఆయనకి పెళ్ళి అయింది.

ఆమె చాలా బావుంటుంది

నేను పాతదాన్నయ్యాను. కాబట్టి నన్ను దూరం చేస్తాడేమో అని అనుకున్నాను. అదేం జరగలేదు. మా అనుబంధం పెళ్ళి తర్వాత మరింత గట్టిపడినట్లు అనిపించింది.

నాకు ఆయనంటే వేల్లమాలిన ఇష్టం కాసాగింది.

ఎంత పిచ్చిది తను! తనేమిటి అతన్ని ప్రేమించడమేమిటి? పిచ్చా? అని అనుకునేది తను.

పండంటి బాబు పుట్టాడు వాళ్ళకి.

వాళ్ళ ఆనందానికే కాదు నా ఆనందానికీ అవధుల్లేకపోయాయి. సంవత్సరాలు దొర్లుతుంటే బాబు ఎదిగిపోసాగాడు.

బాబును చూస్తుంటే ముచ్చటేసేది నాకు.

తొందర తొందర్లో ఆయన బయటికి వెళ్తూ నన్ను ఇంట్లోనే వదిలేసినప్పుడు బాబు నాతో ఆడుకునేవాడు.

ఒకసారి నన్ను బలంగా తన చేతిలోని బ్యాట్ తో కొట్టాడు. అమ్మా అని నేలమీదకి వాలిపోయాను.

అప్పుడే వచ్చిన వాళ్ళ నాన్న బాబును కోపంగా తిట్టి వీపుమీద ఓ దెబ్బవేశాడు నన్ను పైకి తీస్తూ.



ఆయనలో కోపాన్ని చూడ్డం అదే మొదటిసారి.

ఒకవైపు నన్నలా దగ్గరకి తీసుకున్నందుకు ఆనందం మరోవైపు బాబును కొట్టినందుకు బాధ.

దెబ్బ తగిలిన చోట విపరీతమైన నొప్పి. ఆరోజు సాయంత్రం నన్నెవరి దగ్గరికో తీసుకెళ్ళాడు. అతను నన్ను పరీక్ష చేసి ఆరోగ్యవంతురాల్ని చేశాడు. ఆయనకు అతనికి మధ్య జరిగిన సంభాషణ నాకు బాగా జ్ఞాపకం వుంది.

"అంతా ఓ.కె నా!"

"ఓ.కె. సార్"

"ఎంత?'

"వంద రూపాయలు"

అమ్మోయ్! వందరూపాయలే

నా కోసం ఇంత ఖర్చు చేస్తున్నాడా! ఆనందాతిశయంతో కళ్ళింతలు చేసి ఆయన వైపుకి చూశాను ఆరోజు.

ఆ తర్వాత నాకెప్పుడూ అనారోగ్యము కలుగలేదు. కాని బాబు నా దగ్గరకి రావడం మానేశాడు. అలా రాకపోవడం నాకెంతో బాధ కలిగించేది. నన్నెప్పుడైనా ఆయన మరిచిపోయినా ఆమె గుర్తుచేస్తుండేది ఆయనకి.

ఆమె అంటే కూడా గౌరవం నాకు.

ఆయనతో బాటు ఆమె కూడాకష్టపడేది. కాని ఎంత కష్టపడినా ఏదో ఓ ఆర్థిక సమస్య వాళ్ళను బాధపెడుతూనే ఉండేది. దానికి తోడు బాబు ఆరోగ్య పరిస్థితి.

ఓ రోజు తీవ్రమైన జ్వరం వచ్చింది బాబుకి.

ఆయన చాలా ఆందోళన చెందాడు. ఆమె ఏడ్చింది. అలా జ్వరం రావడం అది మొదటిసారి కాదు. అంతకుముందు రెండుమూడుసార్లు అలాగే వచ్చింది. దగ్గర్లో వున్న డాక్టర్ కు చూపిస్తే తగ్గిపోయింది. ఓసారి స్పెషలిస్టు దగ్గరకి తీసుకుని వెళ్ళాడు.

దోమలగూడలో అందమైన ఇల్లుందా స్పెషలిస్టుకి. కన్సల్టేషన్ వంద రూపాయలు మొదటిసారి చూడ్డానికి. కొన్ని టెస్టులు చేయించమన్నాడు బాబును చూసి. టెస్టులు ఏ డయాగ్నొస్టిక్ సెంటర్ లో చేయించాలో డాక్టరే చెప్పాడు. డాక్టర్ ఫీజు వంద రూపాయలు ఇచ్చేసి డయాగ్నొస్టిక్ సెంటర్ కి ఆటోలో బయలుదేరాడు ఆయన. బాబును వళ్ళో కూర్చోబెట్టుకున్నాడు. కళ్ళనిండా నీళ్ళు. ఆయన్ని చూస్తుంటే మనస్సు ద్రవీభవించిపోయింది. అయినా తనేం చేయగలదు.

టెస్టులు పూర్తయ్యాయి. అప్పటికప్పుడే రిపోర్ట్సు తయారుచేశారు వాళ్ళు. మొత్తం ఏడు వందల రూపాయలు టెస్టులకయ్యాయని అక్కడి వాళ్ళ మాటల్ని బట్టి తెలుసుకున్నాను. జేబులోంచి డబ్బు బయటికి తీసి, చూస్తుంటే ఆయన దగ్గర ఐదు వందల రూపాయలు మాత్రమే ఉన్నాయని నాకు తెలిసిపోయింది.

రిపోర్ట్సు తీసుకోవాలంటే ఇంకా రెండు వందల రూపాయలు కావాలి? ఎలా?

అతను కళ్ళుమూసుకుని ఆలోచిస్తున్నాడు.

ఆయన కళ్ళనుండి నీళ్ళు కారిపోతున్నట్లు అనిపించింది నాకు.

ఇంట్లో కూడా డబ్బులు లేవు. ఎవరినీ అడగడానికి వీల్లేదు. ఎందుకంటే అప్పటికే బోలెడన్ని అప్పులున్నాయి. ఎందుకో అనుకోకుండా తలతిప్పి నావైపుకు చూశాడు.

ఆ చూపులో వేరే అర్థం వుంది.

ఆ అర్థం ఏమిటో నాకు అర్థమయింది.

అంతకంటేనా!

నేను ఆయనకి ఏ మాదిరిగా ఉపయోగపడాలా అని ఆలోచిస్తున్న తరుణంలో ఆయనకి అలాంటి ఆలోచన రావడం నాకెంతో ఆనందాన్ని ఇచ్చింది.

ఐదువందలు ఇచ్చేసి మిగిలిన డబ్బులు ఇప్పుడే వచ్చి ఇస్తానని రిపోర్ట్సు సిద్ధంగా ఉంచమని చెప్పి బాబుతో ఆటోలో మళ్ళీ బయలుదేరాడు. అదో చిన్న షాపు. షాపతనికి తెలుగు సరిగ్గా రానట్లుంది. ఆయనకి షాపతనికి మధ్య కొంతసేపు హిందీలో సంభాషణ జరిగింది.

"రెండువందల కంటే ఎక్కువ ఇవ్వలేను"

"మూడు వందలు కావాలి"

లేదు. మూడువందలు దీని ఖరీదే వుండదు సాబ్. మూడు వందలు ఇవ్వమంటే ఎలా?

నాకా కసాయి వాడి మీద కోపం వచ్చింది. నా విలువ అంతేనా. ఎలా మరి? ఆయన అవసరం ఎలా తీరుతుంది?

మరో ఐదు నిముషాలు ఆ కసాయివాడిని బ్రతిమిలాడాడు ఆయన తన పరిస్థితిని తెలుపుకుంటూ.

ఆ కసాయివాడు రెండువందల యాభై ఇస్తానన్నాడు చివరికి. డబ్బులు తీసుకుని నన్ను ఆ కసాయివాడికి అప్పగించాడు.

నా భుజానికి చీటికడుతుంటే ఆయన నా వైపుకి ఏదో తప్పుచేసినట్లు చూశాడు.

కళ్ళనిండా నీళ్ళు.

ఆయన వెళ్ళిపోయాడు.

నన్ను చీకట్లోకి తోసేశాడా కసాయివాడు.

మళ్ళీ ఎప్పుడు ఆయన్ని చూడ్డం? చూడగలదా తను!

(మిగతా 12వ పేజీలో)

# మౌనానురాగం

(5వ పేజీ తరువాయి)

నిజంగా ఆయన నన్ను ప్రేమిస్తున్నాడా

మాలాంటి ప్రాణంలేని యంత్రాల్ని వస్తువుల్ని ప్రాణమున్న మనిషి ప్రేమించగలడా? మనుషుల్లాగే జంతువుల్లాగే ఈ భూమ్మీద మాకు అస్తిత్వం ఏర్పడింది. మేము లేనిదే మనిషి బతకలేని స్థితికి వచ్చేశాడు. దేవుడు మనిషిని సృష్టిస్తే ఆ మనిషి మమ్మల్ని సృష్టించాడు. మనిషి మాకు దేవుడు. ఆ దేవున్ని ప్రేమించడం తప్పా! అసలు మాకూ హృదయం వుందని ఎంతమంది మనుషులకు తెలుసు. ఎంతమంది తమని యంత్రాలుగా కాకుండా తమజీవన ఘర్షణలో ఉపయోగపడుతున్న స్నేహితులుగా భావిస్తున్నారు. తమకు పనికి వచ్చేవరకు వాడుకుని తర్వాత అవతల పడేసే కృతఘ్నులు ఈ మనుషులు.

ఆయన అలాంటి వాడేనా!

ఆలోచిస్తుంటే మళ్లీ తలుపుతెరుచుకుంది. నాతోబాటు అక్కడ ఇంకెంతో మంది నిర్బంధితులున్నారని నాకు తెలిసింది. మళ్లీ చీకటి. నా గుండె శబ్దం పూర్తిగా బలహీన పడసాగింది.

ఒక క్షణం..

రెండు క్షణాలు...

ఇంకొన్ని క్షణాల్లో నా ప్రాణం పోతుందని నాకు స్పష్టంగా తెలిసిపోయింది.

* *** *

నేను కళ్లు తెరిచేసరికి చుట్టూ కళ్లు మిరుమిట్లు గొలిపే వెలుగు. నా ఆనందానికి అవధుల్లేవు. అంతకుముందే నన్నెవరో కుదిపి లేపినట్లుంది.

నాకు స్పృహ వచ్చింది. సుదీర్ఘమైన సుషుప్తి నుంచి మేల్కొన్నట్లు అనిపించింది. ఆరోజు స్పృహ కోల్పోవడం నాకింకాబాగా జ్ఞాపకం ఉంది.

ఎన్నాళ్లయింది!

ఎవరు నన్ను కసాయివాడి నిర్బంధం నుంచి విముక్తి చేసింది. నాకు మళ్లీ ప్రాణం పోసింది ఆయనేనా!

ఈ విలువలేని దాని మీద అంత అభిమానమా !

బాబు ఎలా ఉన్నాడు! జ్వరం తగ్గిందా!

ఆలోచిస్తుంటే రెండు చేతులు నన్ను స్పృశించాయి.

కళ్లు పెద్దవి చేసి చూశాను.

ఆయనే!

హృదయం ఆనందంతో మూల్గింది.

ఇంటికి వెళ్లాం.

వరండాలో ఆడుతూ బాబు కన్పించాడు. లోపలికి వెళ్లాము. ఆమె వంట చేస్తుంది. నన్ను చూస్తూనే ఆశ్చర్యచకితురాలయింది. ఆ రోజు ఆయనకు ఆమెకు మధ్య జరిగిన సంభాషణ నేనెప్పటికీ మరువలేను.

"వాచ్‌ను తాకట్టు నుంచి విడిపించుకొచ్చారా?"

"అవును"

"ఎంతయింది"

"రెండు వందల యాభై ప్లస్ నెలకు ఇరవై అయిదు రూపాయల చొప్పున ఇంటరెస్టు ప్లస్ బాగుచేయించడానికి వంద మొత్తం ఐదు వందల యాభై"

"ఐదు వందల యాభై పెడితే కొత్త వాచ్ వచ్చేది కదండి. మళ్లీ ఆ పాతదాన్నే ఎందుకు తీసుకొచ్చారు"

"నో..నో.. అలా మాట్లాడకు ఇంకా వెయ్యి రూపాయలయినా ఈ వాచ్‌నే తెచ్చేవాడిని. ఈ వాచ్ అంటే నాకెంతో ఇష్టం. ఐలవ్ ఇట్"

"యు ... లవ్ ఇట్?" ఆమె కిలాకిలా నవ్వసాగింది.

నాలో అమితానందం వల్ల కలిగిన అదోలాంటి ఉద్వేగం ఆయన నన్ను ప్రేమిస్తున్నాడు. నాలోని మౌనానురాగాన్ని గుర్తించారు. అంతకంటే ఎక్కువ ఇంకేమి కావాలి తనకు!



137